సబ్సిడీ సిలిండర్లు పక్కదారి!

- రాయితీ సిలిండర్లను వినియోగిస్తున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు
- గ్యాస్ ఏజెన్సీల సాయంతో గుట్టుగా సరఫరా చేస్తున్న అక్రమ వ్యాపారులు



భువనగిరిటౌన్: జిల్లాలో సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. గృహ అవసరాలకు వినియోగించాల్సిన రాయితీ సిలిండర్లను టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు వాడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన పౌరసరఫరా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 2.92 లక్షల కనెక్షన్లు..

జిల్లా వ్యాప్తంగా 20 గ్యాస్ ఏజెన్సీల ద్వారా ప్రతి రోజు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తారు. ఇందులో దీపం పథకం కింద 53,920, ఉజ్వల పథకం కింద 13,777 సాధారణ కేటగిరీలో 2,01,468, సీఎస్ఆర్ 23,322 మొత్తంగా 2,92,487 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వంట గ్యాస్ కనెక్షన్లు కలిగిన కుటుంబాల్లో కొందరు సింగిల్, మరికొందరు డబుల్ సిలిండర్లు కలిగి ఉన్నారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.2,070 ఉంది. గృహ అవసరాల రాయితీ సిలిండర్ ధర రూ 857.50 ఉంది. వాణిజ్య సిలిండర్ పోలిస్తే రాయితీ సిలిండర్ ధర రూ. 1,212.50 తక్కువ. దీంతో వ్యాపారులు ఉజ్వల, దీపం పథకం కింద రాయితీ గ్యాస్ కనెక్షన్లు కలిగి డబుల్ సిలిండర్లు ఉన్న కుటుంబాలను ఆశ్రయిస్తున్నారు. వారికి అసలు ధరతో పాటు అదనంగా రూ.200 నుంచి రూ.500 వరకు ముట్టజెప్పి సిలిండర్లను తెచ్చుకొని వినియోగిస్తున్నారు. ఇదిలా ఉండగా.. కొందరు కిరాణా దుకాణాల నిర్వాహకులు పట్టణాలు, మండల కేంద్రాల్లో గ్యాస్ సిలిండర్ల వ్యాపారానికి తెరదీశారు. గ్యాస్ ఏజెన్సీల సాయంతో రాయితీ సిలిండర్ల కనెక్షన్లు తీసుకొని టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు గుట్టుగా సరఫరా చేస్తున్నారు. అంతేకాకుండా సబ్సిడీ సిలిండర్లను చిన్న గ్యాస్ సిలిండర్లలో ఫిల్లింగ్ చేయడానికి వినియోగిస్తున్నారు.

గ్యాస్ డోర్ డెలివరీ చేస్తే రూ.43 ఎక్కువ

గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు 15 కిలోమీటర్లు లోపు ఉన్న వారికి గ్యాస్ సిలిండర్ ఫ్రీ డోర్ డెలివరీ చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు డెలివరీ బాయ్స్ మాత్రం సిలిండర్ ధర రూ.857 ఉండగా.. వినియోగదారుల నుంచి రూ.900 తీసుకుంటున్నారు. ప్రతి రోజు ఒక డెలివరీ బాయ్ 30 నుంచి 50 గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేస్తారు. ఈ లెక్కన వారు రూ.2150 వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు.

తనిఖీలు చేస్తాం

వాణిజ్య దుకాణాల్లో సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తే చర్యలు తీసుకుంటాం. రెండు మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా తనిఖీ చేస్తాం. వినియోగదారులు డోర్ డెలివరీ చేసే గ్యాస్ సిలిండర్లకు బిల్లుపై ఒక్క రూపాయి కూడా ఎక్కువ ఇవ్వద్దు. డెలివరీ బాయ్స్ అడిగితే మాకు సమాచారం అందించాలి.

– రోజారాణి, ఇన్‌చార్జ్ డీఎస్‌ఓ

చెరువులకు గోదావరి జలాలు అందించాలి



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

రాజాపేట: గొలుసుకట్టు చెరువులకు గోదావరి జలాలు అందించాలని కోరుతూ శనివారం జల సాధన సమితి జేఏసీ ఆధ్వర్యంలో రాజాపేట మండలంలోని పొట్టిమర్రి వాగులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ద్వారా గంధమల్ల చెర్వు నుండి వస్తున్న పొట్టిమర్రివాగులో తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఈ ప్రాంత రైతులకు సాగు జలాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ జశ్వంత్, నాయకులు సట్టు కుమ్మరి లక్ష్మణ్, తిరుమలేష్, వెంకట్‌రాంరెడ్డి, గుంటి మధుసూదన్‌రెడ్డి, గుంటి కృష్ణ, మేక వెంకటేశ్వర్‌రెడ్డి, పల్లె సంతోష్ గౌడ్, ఉల్లి రమేష్, నర్సింహులు, పుల్లయ్య, రాజు, ఉపేందర్, ఉప్పలయ్య గౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న కిషోర్‌కుమార్

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వడకాల రామ్మూర్తి మాతృమూర్తి రాములమ్మ, బండ కొమురయ్య తల్లి బండ నర్సమ్మ, బాలెంల నర్సింహ తల్లి బాలెంల సాలమ్మ ఇటీవల మరణించారు. శనివారం బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కె.ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే హమాలీల కూలి రేట్లు పెంపు

భువనగిరి: ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగానే హమాలీల కూలి రేట్లు పెంపు జరిగిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ గోడాన్ వద్ద కాంట్రాక్టర్‌తో జరిగిన చర్చల్లో టన్ను బియ్యం దిగుమతికి కూలి రేట్లు రూ. 35 నుంచి రూ.40కు పెంచుతున్నట్లు ఒప్పందం జరిగిందని తెలిపారు. సమావేశంలో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరాలయంలో విశేష పూజలు

వలిగొండ : మండలంలోని ఆరూర్ లో ఇటీవల నూతనంగా దాతల సహకారంతో నిర్మించిన శ్రీ ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, మృత్యకాస్థాపనం, దేవానంది, దీక్షారాధన, పంచగవ్యప్రాశన వాస్తు మండపారాధన చేశారు.

విశ్వాసం, ప్రయత్నమే లక్ష్యసాధనకు మార్గాలు

- సినీ నటుడు జేసీ ప్రదీప్



స్థానిక యువతతో సినీ నటుడు జేసీ ప్రదీప్

భూదాన్‌పోచంపల్లి: విశ్వాసం, ప్రయత్నం లక్ష్యసాధనకు మార్గాలని సినీ నటుడు జేసీ ప్రదీప్ అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని టూరిజం పార్కులో జేసీఐ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓరియంటేషన్ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువతకు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. మనం ఎలా ఆలోచిస్తే, అందుకు తగ్గట్టుగానే ఫలితాలు వస్తాయని, అందుకే పాజిటివ్ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. యువతకు స్వయం ఉపాధి పొందుతూ మరో పదిమందికి ఉపాధి కల్పించేందుకు జేసీఐ సంస్థ మంచి వేదిక అని తెలిపారు. అనంతరం టూరిజం పార్కులో ఏర్పాటుచేసిన మగ్గాలను చూసి పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు, కార్మికుల కళా నైపుణ్యాలను కొనియాడారు. అనంతరం ప్రదీప్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జోన్ వైస్ ప్రెసిడెంట్ జేసీ వేణుగోపాల్, ఐజేసీ అధికారి రామకృష్ణ, కోఆర్డినేటర్ గాయత్రి, శివకుమార్, జేసీ మనీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైతిక విలువలు కలిగి ఉండాలి

- భూదాన్‌పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి



ఇంటర్ టాపర్ విద్యార్థికి బహుమతి అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: విద్యార్థులు విద్యతోపాటు నైతిక విలువలు కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని జేవీ ఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ హరిప్రసాద్, అధ్యాపకులు తులసి, వెంకటేశ్వర్లు, శివశంకర్, సాయివర్ధన్, వెంకటేశం, సంతోష్‌కుమార్, వెంకట్‌రెడ్డి, చందన, శ్రీదేవి, మంజుల, పర్వీన్ పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గుండాల: గుండాల రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 177లో అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నీలిమకు వినతిపత్రం అందజేశారు. వారిలో రాంరెడ్డి, నారాయణ, ఆంజనేయులు, పరశురాములు, నర్సిరెడ్డి, వెంకటేష్, సత్తయ్య, బాలమల్లు, పాండురెడ్డి, వెంకటయ్య, రమేష్, మోషా, సత్తయ్య, సురేష్ ఉన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి దగ్ధం

మోత్కూరు: పశువుల మేత కోసం రైతు గడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై తీసుకొస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ తీగలు తగిలి దగ్ధమైంది. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన రైతు వెంగల ఉపేందర్‌రెడ్డి వలిగొండ మండలం ముద్దాపురం గ్రామంలో ట్రాక్టర్ లోడ్ గడ్డిని కొనుగోలు చేసి శనివారం గ్రామానికి తరలిస్తున్నాడు. ఈ క్రమంలో మోత్కూరు పట్టణంలోని జ్యోతిరావు పూలే చౌరస్తా ఆరెగూడెం రోడ్డు మూల మలుపు వద్ద కరెంటు తీగలు గడ్డి లోడుకు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. ఫైర్ ఎస్ఐ భీముడు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి వేశారు. సుమారు రూ.50 వేల నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపాడు.

మురుగుకూపాలుగా ఖాళీ స్థలాలు

- కలెక్టర్ ఆదేశాలతో నోటీసులు జారీ చేసిన మున్సిపల్ అధికారులు



ప్లాట్ యజమానికి నోటీసులు జారీ చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ రజిత

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలో ఖాళీ స్థలాలు మురుగుకూపాలుగా మారుతున్నాయి. దీంతో పందులు, దోమలకు అవాసాలుగా మారి ప్రజలను కలవరపెడుతున్నాయి. ఇళ్ల నిర్మాణం కోసం యజమానులు కొన్ని స్థలాలు ఖాళీగా ఉంచడంతో ఆ స్థలాల్లో నీరు చేరి దుర్వాసన వస్తోంది. అంతేకాకుండా పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగి చెత్తాచెదారంతో నిండుకుంటుంది. పట్టణంలో 35 వార్డులు ఉండగా ప్రతి వార్డులో ఐదు నుంచి 10వరకు దాదాపు 3వేల వరకు ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఈ నెల 19న 7వ వార్డులో కలెక్టర్ హనుమంతరావుతో పాటు, అదనపు కలెక్టర్ గంగాధర్ పర్యటించారు. ఈ క్రమంలో ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం, మురుగునీరు ఉండడం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఈమేరకు ఆరు ప్లాట్లను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేశారు.

రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు అందజేస్తున్న ఉప్పలయ్య

రామన్నపేట: రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పొన్న ఉప్పలయ్య కోరారు. శనివారం రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామంలో నిర్వహించిన రజక వృత్తిదారుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రజకుల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, సబ్సిడీపై పనిముట్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సిరసనగండ్ల నరసింహ, దావనూరి పిచ్చయ్య, గంప పద్మ, సిరసనగండ్ల నర్సమ్మ, దామెర వంశీ, బాసవాడ ఎలందర్, పొన్న అండాలు, సాయమ్మ, గంప వెంకటమ్మ పాల్గొన్నారు.

లింగబస్వేశ్వరాలయంలో కలెక్టర్ పూజలు



బ్రహ్మోత్సవ పూజల్లో పాల్గొన్న కలెక్టర్,

బీబీనగర్: మండలంలోని పడమటిసోమారం గ్రామంలో శనివారం నిర్వహించిన శ్రీలింగబస్వేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో కలెక్టర్ హనుమంతరావు పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయనకు ఆలయాధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట ఆర్డీఓ కృష్ణారెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

25న సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం

భూదాన్‌పోచంపల్లి: వలిగొండలో ఈ నెల 25న జరిగే సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్రకమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ కోరారు. శనివారం భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నారాయణగిరిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విస్తృతస్థాయి సమావేశంతో పాటు, వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి సమావేశంలో చర్చించి ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, కమిటీ సభ్యులు వడ్డెపల్లి యాదగిరి, పానమోని కృష్ణ, శాఖ కార్యదర్శి గూడురు రాంరెడ్డి, జంగారెడ్డి, కృష్ణారెడ్డి, సత్తిరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

వలిగొండ: వలిగొండలో ఈనెల 25న నిర్వహించనున్న సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



వంగపల్లి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

యాదగిరిగుట్ట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వంగపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలో ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యా సంవత్సరం ముందుగానే గ్రామంలో ఇంటింటికీ తిరిగి, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఈమేరకు ఉపాధ్యాయ బృందం విజన్-2030 పేరుతో ఒక డాక్యుమెంట్‌ను రూపొందించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

బీజేపీ నాయకుల ప్రచారం

బొమ్మలరామారం: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం బొమ్మలరామారం మండలంలోని మల్యాల కేజీబీవీ, మోడల్ స్కూల్, మండల కేంద్రంతో పాటు తిమ్మాపూర్, రామలింగం పల్లి, మేడిపల్లి గ్రామాల్లోని జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ వినోద్ కుమార్ జాదవ్, ప్రభరి బాల్‌రాజ్, సీనియర్ నాయకులు రంగారామాగౌడ్, జగ్గర్ల ఆనంద్ గౌడ్, రవీందర్ రెడ్డి, రవి శంకర్, కుర్మిండ్ల ఈశ్వర్ గౌడ్, బైరగోని మహేష్ గౌడ్, నరేష్ నాయక్, గణేష్ పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్ర అభివృద్ధికి రూపాయి కూడా ఇవ్వని కాంగ్రెస్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఆరోపించారు. శనివారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.1300 కోట్ల ప్రభుత్వ ఖజానాతో మాజీ సీఎం కేసీఆర్ యాదగిరిగుట్టను మహాద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. సమావేశంలో ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు పేరబోయిన సత్యనారాయణ, కోన్యాల నర్సింహారెడ్డి తదితరులున్నారు.

కందాల రంగారెడ్డికి ఘన నివాళి



రంగారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం కందాల రంగారెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రంగారెడ్డి చేసిన పోరాటాలు, పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. పార్టీ సీనియర్ నాయకుడు బొంతల చంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, సైదులు, కరుణాకర్, ఎండీ పాష, కిష్టయ్య, అంజిరెడ్డి, మోహన్, రాంరెడ్డి పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం

యాదగిరిగుట్ట మండలంలోని మైలార్‌గడ్డ తండా ప్రాథమిక పాఠశాల, పోచంపల్లి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, చౌటుప్పల్‌లోని బీసీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల, గుండాల మండలంలోని అనంతారం ప్రాథమిక పాఠశాల, మోటకొండూర్: అమ్మనబోలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రామన్నపేట: జనంపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధించారు.



గుండాల: అనంతారం ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం



యాదగిరిగుట్ట రూరల్: మైలార్‌గడ్డతండాలో..



మోటకొండూర్: అమ్మనబోలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



భూదాన్‌పోచంపల్లి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



చౌటుప్పల్: బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



రామన్నపేట: జనంపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలనా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భువనగిరి: భువనగిరిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సాయికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌజింగ్‌బోర్డు కాలనీ, హైదరాబాద్ చౌరస్తా, ఎల్‌బీనగర్, ఇందిరానగర్, రాంనగర్, స్వర్ణగిరి, సింగన్నగూడెం సీతానగర్, టీచర్స్‌కాలనీ, బొమ్మాయిపల్లితో పాటు ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంపీకి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక అందజేత

రామన్నపేట: మండలంలోని నిధానపల్లి మల్లన్నగుట్టపై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ఉత్సవ నిర్వాహకులు ఆహ్వానించారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో ఎంపీని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈనెల 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ గుత్తా నర్సింహారెడ్డి, గుత్తా శ్రీనివాస్‌రెడ్డి, కట్టగూరి ప్రసాద్, కొండ వెంకటేష్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయంలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో ఈనెల 25, 26తేదీల్లో జరిగే శివరాత్రి మహోత్సవాలకు హాజరుకావాలని ఉత్సవ నిర్వాహకులు ఉప్పల కృష్ణ- కుసుమ, ఉప్పల అశోక్‌కుమార్- పద్మ, ఉప్పల కేదార్‌నాథ్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

లింక్‌రోడ్లను వెడల్పు చేయాలి

చండూరు : భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని చండూరు మున్సిపాలిటీకి అనుసంధానం అయ్యే వివిధ గ్రామాల లింకురోడ్లను 60ఫీట్ల వెడల్పు చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు.

వైభవంగా శ్రీసీతారాముల కల్యాణం

మోత్కూరు: మోత్కూరు మండలంలోని పాలడుగు గ్రామంలో శ్రీ సీతారాముల చంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మరిపల్లి యాదయ్య దంపతులు గుండు కృష్ణమూర్తి, పులగం వెంకట్‌రెడ్డి, సింగిరెడ్డి నర్సింహ్మారెడ్డి, అంతటి నర్సయ్య, యాస నర్సిరెడ్డి, గూదె మధుసూదన్, ఎడ్ల భగవంతు, పబ్బు హన్మయ్య, బరిగెల నారాయణ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న పరశురాములు

గుండాల: మండలంలోని వెల్మజాల గ్రామంలో వాయిస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో స్టెప్స్ వాయిస్ సంస్థ డైరెక్టర్ హెజ్ర దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెరిపోతుల పరశురాములు, మాజీ సర్పంచ్ సంగి బాలకృష్ణ, కొత్తగండ్ల సంజీవ, లింగాల రమేష్, సంగి వెంకటయ్య, మధు, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25, 26న రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

వలిగొండ: మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని శ్రీ పార్వతీ సమేత శ్రీ పంచముఖ రామలింగేశ్వర స్వామి అనుబంధ దేవాలయంలో ఈ నెల 25, 26న స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి మోహన్‌బాబు శనివారం తెలిపారు. ఆలయ పరిధిలో కిరాణా సామాన్లు సరఫరా చేసేందుకు మార్చి 3న సీల్డ్ టెండర్ వేయడానికి ప్రక్రియ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మిగతా వస్తువుల సరఫరా చేసేందుకు ఆలయ పరిధిలో మార్చి 4న నిర్ణయించామని తెలిపారు.

మైక్‌సెట్ బహూకరణ

రాజాపేట: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు ఎస్కే మహమూద్ తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా శనివారం స్థానిక పాఠశాలకు రూ. 10వేల విలువగల మైక్‌సెట్‌తోపాటు గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.